# రాధా మాధవీయం

తాతాజీ

ఈ ప్రపంచంలో ఎన్ని ప్రాణికోటి యున్నా బాధ ఒక్కటే. కొన్ని ప్రాణులకు తమ బాధ ఒకరితో చెప్పుకోవడానికి, కొంతలో కొంత అయినా తీర్చుకోవడానికి అవకాశం సహజంగా ఉంది. మరికొన్నిటికి అలాంటి అవకాశం లేదు. అవి మూగగా అనుభవించే బాధను నిష్పక్షంగా చూడగల శక్తి అందరికీ ఉండదు. అలాంటి అమాయక ప్రాణుల బాధను, మనుషులకు సంభవించే ఈతిబాధలకు ముడిపెట్టడం మరీ దుస్సాహంగా ఉంటుంది.

"రాధా! రాధా! ఇటు చూడు. ఏం తెచ్చానో!"

"... ... ... ... ..."

"రాధా! విన్నీ! ..."

రాధ చంటి బిడ్డను ఎత్తుకుని హడావిడిగా హాల్లోకి వచ్చింది. నవ్వుతూనే చటుక్కున నిలబడిపోయింది, ఆశ్చర్యం కళ్లలో కనబడుతూ.

భర్త మాధవరావు చిన్న కుక్కపిల్లను చంకలో ఎత్తుకుని నవ్వుతూ నిలబడి ఉన్నాడు.

"ఏమిటలా చూస్తున్నావు, రాధా? మనకో పప్పీని తెచ్చాను పెంచడానికి. మంచి సీమజాతి కుక్క-లవ్లీ పప్పీ! నీకు బుజ్జి! నాకు పప్పీ! ఏం బాగుండలేదూ?"

రాధ చిన్నగా నవ్వింది. కాని ఆ నవ్వులో సంతోష చ్ఛాయలు లేవు. బలవంతాన తెచ్చుకున్న నవ్వు. రాధకు కుక్కపిల్లలంటే సరదా లేదు. ఒకవిధమైన అసహ్యం కూడాను.

"నీకు కుక్కపిల్లని పెంచాలని సరదా లేదా? అవునులే, నీకు బుజ్జిగాడితోటే సరిపోతుంది. నేను చూసుకుంటాలే పప్పీ గొడవంతా. బై ది బై, రాధా, ఈ పప్పీకి ఏం పేరు పెడదాం? ... నేను నమ్మానే ఆలోచించేసులే ... లూసీ! .. ఎలా ఉందా పేరు?" అంటూ రాధ కళ్లలోకి ఆదుర్దాగా చూశాడు మాధవరావు.

రాధ మళ్లీ చిరునవ్వు నవ్వింది. 'ఆ పేరు చాలా బాగుంది' అనే అర్థం స్ఫురించింది ఆ నవ్వులో మాధవరావుకు.

ఇంతలో పూజ గదిలోనుండి శాంతమ్మ హాల్లోకి వచ్చింది.

"అమ్మా, మంచి కుక్కపిల్లని తెచ్చానమ్మా. ఎన్నాళ్లనుండో అనుకుంటున్నాను పెంచాలని. చూడు, ఎంత అందంగా ఉందో!"

తెల్లగా, బొమ్మలా ఉన్న ఆ కుక్కపిల్లను చూస్తే శాంతమ్మకు కూడా ముచ్చటయింది. ఒకసారి చేతుల్లోకి తీసుకొని ఎత్తుకుందా మనిపించింది. కాని ఎందుకో అలా చెయ్యలేదు.

"పిల్లలు లేనివాళ్లకి ఈ కుక్కలూ పిల్లులూగాని, మనకెందుకురా? ఇంట్లో గొడవ చాలకనా? మీ నాన్నగారు ఒకప్పుడు పెద్ద అల్సేషియన్ కుక్కని పెంచారు. కాని అది ఒక రోజున హఠాత్తుగా చనిపోయింది. దానితో మీ నాన్నగారు కొన్నాళ్లు బెంగపెట్టుకున్నారు కూడా."

"పర్వాలేదమ్మా. ఇంట్లో ఇంతమంది ఉండగా ఈ చిన్ని పప్పీని పెంచలేమా? పప్పీ గొడవంతా నేను చూసుకుంటానులే, మీ కెవ్వరికీ శ్రమ లేకుండా."

శాంతమ్మ నవ్వుతూ వంటింట్లోకి వెళ్లిపోయింది.

"చూడు రాధా, బుజ్జిగాణ్ణి నాకిచ్చి, కొంచెం పాలు తీసుకురా, పప్పీకి పట్టించాలి."

చంటి బిడ్డను సోఫాలో కూర్చోబెట్టి రాధ పాలు తేవడానికి వెళ్లింది. కుక్కపిల్లని కూడా సోఫాలో కూర్చోబెట్టి ఇద్దర్నీ చూసి ఆనందిస్తున్నాడు మాధవరావు.

ఇంతలో కుక్కపిల్ల సోఫాలో ఒకటికి పోసింది. సోఫా తడిసి ఖరాబయింది. మాధవరావు గాభరాపడి హడావిడిగా దాన్ని కిందికి దించేశాడు.

"రాధా, రాధా, ఒక్కసారి ఇలా రా. పాతగుడ్డ ఏదయినా తీసుకురా" అంటూ కంగారుగా పిలిచాడు.

రాధ హాల్లోకి వచ్చి ఆ దృశ్యం చూసి వకావకా నవ్వింది. కాని మాధవరావు ముఖం చూసి చటుక్కున నవ్వు ఆపేసింది. అతని గాథ రాచూసి పరిగెత్తుకువెళ్లి పాత గుడ్డ తెచ్చి సోఫా అంతా శుభ్రం చేసింది.

ఆ పూటంతా మాధవరావుకు కుక్కపిల్లతోనే సరిపోయింది. దానికి పాలు తాగించడానికి ఒక చిన్న పళ్లెం, పడుకోడానికి చిన్న పక్క వగైరాలన్నీ సమకూర్చాడు.

సాయంకాలం ఆఫీసునుండి రాగానే లూసీని షికారు తీసుకువెళ్లడం, పాలు పట్టించడం, పడుకోబెట్టడం — ఇదీ అతని దినచర్య. మాధవరావు కూతురు సుశీల సంగతి సరేసరి. కాన్వెంటుకు వెళ్లిన ఆ నాలుగు గంటలూ తప్ప మిగతా రోజంతా లూసీతోనే గడుపుతుంది. లూసీకి సపర్యలు చేయడంలో వాళ్ల నాన్నకు సుశీల సహాయం ఇంతా అంతా కాదు.

కుక్కపిల్ల వచ్చిన తరవాత రాధకు పని ఎక్కువైంది. తీరికవేళల్లో సుశీల తమ్ముణ్ణి ఆడిస్తూ ఉండేది. ఇపుడు బుజ్జిని పూర్తిగా తనకి వదిలేసి లూసీతోనే ఉంటూంది. అటు ఇంటిపనులు చూసుకోవడం, ఇటు చంటిబిడ్డని చక్కబెట్టుకోవడం, మధ్య మధ్య మాధవరావు పురమాయింపులతో లూసీకి సపర్యలు చెయ్యడం — రాధకు అసలే తీరికలేకుండా ఉంది.

కుక్కపిల్లలంటే తన కిష్టంలేకపోయినా లూసీని చూస్తే రాధకెందుకో సరదా కలుగుతూంది. దాని చిన్నతనం, అమాయకత్వం, నిస్సహాయత, కన్నతల్లి నుండి చిన్నతనంలోనే విడిపోయి ఎవరి ఇంట్లోనో బ్రతకడం—ఇవన్నీ చూస్తే ఆమెకు జాలి కలుగుతూంది. 'నా బిడ్డ బుజ్జికి దీనికి తేడా ఏమిటి?' అనుకుంటుంది ఒకొక్కసారి. పైగా తన భర్త బిడ్డల్ని ఎంత ప్రేమిస్తున్నాడో ఈ లూసీని కూడా అంతగానూ ప్రేమిస్తున్నాడు. అది అస్తమానం అమాయకపు చూపులతో అందరి కాళ్లకీ అడ్డంపడి పలకరిస్తుంది. అటువంటి నోరులేని పసిదాన్ని ప్రేమించకుండా ఉండలేం. అయినా కుక్కపిల్లలంటే తనలో సహజంగా ఉన్న ఏవగింపుమాత్రం పోవడంలేదు.

ఒకరోజు ఉదయం మాధవరావు తల్లి శాంతమ్మ అప్పుడే స్నానంచేసి వంటింటి పడవలో కూర్చుని ఉంది. ఇంతలో ఎక్కడనుండి వచ్చిందో లూసీ చటుక్కున వచ్చి ఆవిడ ఒడిలో కూర్చుంది. తన మడి కాస్తా మైలపడిపోయినందుకు శాంతమ్మకు ఎక్కడలేని కోపం వచ్చింది. ఒక్క విదిలింపుతో లూసీని అంతదూరం విసిరి, కోడల్ని గదమాయించి పిలిచింది.

"చూడు, రాధా, ఈ వెధవ కుక్కపిల్ల నా మడి కాస్తా మైలచేసింది" అంటూ రుసరుసలాడింది.

వంటింట్లోనుండి రాధ పరిగెత్తుకువచ్చింది, అత్తగారి కేకలు విని. లూసీని తీసుకుపోయి పెరటి వరండాలో గట్టిగా కట్టేసి వచ్చింది. ఆ సమయంలో మామూలుగా కట్టేసి ఉండవలసిన లూసీని ఎవరు విప్పారా అని విచారణ చేసింది, అత్తగారి కోపం తగ్గించడానికి. సుశీల బడికి వెళుతూ దానితో కాస్సేపు ఆడుకొని గొలుసు విప్పేసి పోయింది. అది తిన్నగా అత్తగారి ఒడిలోకి దూకింది. అదీ జరిగింది. ఈ విచారణ అంతా అయ్యేసరికి శాంతమ్మ కోపంకూడా తగ్గింది. ఆవిడ మళ్లీ స్నానం చెయ్యడానికి వెళ్లిపోయింది.

ఆ సాయంకాలం మాధవరావు ఇంటికి రాగానే "చూశారా, ఈవేళ ఏం జరిగిందో?" అంది రాధ.

"ఏం జరిగిందేమిటే?"

"ఇంకేం జరగాలి? మీ లూసీ అత్తయ్య మడి కాస్తా మైలచేసిపారేసింది."

"టక్, ఇంతేనా?"

"మీ కలాగే ఉంటుంది. అక్కయ్య కెంత కోపం వచ్చిందో తెలుసా? మధ్య నాకు చివాట్లు తగిలాయి."

"నోరు లేనిదానికి నీకేం తెలుసు మీ మడి మాన్యాల సంగతి?"

"మీ లూసీ మీకు సరదాగాని, అందరికీ అలాగే ఉంటుందా?"

"మీ లూసీ, మీ లూసీ అంటున్నావు. నీ లూసీ కాదా? ఇంతకీ లూసీ అంటే నీకిష్టం లేదనుకుంటాను" అన్నాడు కనుబొమలు చిట్లిస్తూ.

"అదేమిటండీ, మీరలా అనుకుంటారు? కుక్కపిల్లని పెంచడం నాకుమాత్రం సరదా కాదూ? ఇంట్లో పనిపాటులతో, పిల్లలతో నాకు సరిపోతుంది. అయినా దానికేం లోపం చేశాను చెప్పండి? అయితే, మన సరదాలతో పెద్దవాళ్ళకి కష్టం కలిగించకూడదని నా ఉద్దేశం. అంతే" అంటూ చిన్నగా నవ్వి అతని కళ్లలోకి చూసింది, నా మాటల్లో నమ్మకం లేదా అన్నట్లుగా. మాధవరావు ఆప్యాయంగా ఆమెను దగ్గిరికి తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు. రాధ మనస్సు సంతోషంతో నిండి పోయింది. కుక్కపిల్లవల్ల ఇంట్లో మనఃస్పర్థలేవీ రాకూడదని భగవంతుణ్ణి ప్రార్థించింది మనస్సులో.

* * *

మాధవరావు చిన్న కొడుకు బుజ్జికి జ్వరం వచ్చింది. మూటనాలుగు డిగ్రీలతో వచ్చిన జ్వరం మరునాడు కొంచెం తగ్గింది, ఫామిలీ డాక్టరిచ్చిన మాత్రలతో. కాని జ్వరం తగ్గి, విరేచనాలూ, వాంతులూ ప్రారంభమైనాయి. దాంతో రాధకు గాభరా ఎక్కువైంది. రాధ గాభరా చూసి, ఆఫీసుకి ఆలస్యం అవుతూందని తొందరపడుతూన్న మాధవరావు హడావిడిగా డాక్టరు దగ్గిరికి వెళ్లి మందులు తెచ్చాడు. అవన్నీ ఎలా వాడాలో వివరంగా చెప్పి ఆఫీసుకు తయారయ్యాడు.

"ఏమండీ, ఈవేళ ఆఫీసుకి సెలవు పెట్టకూడదూ, బుజ్జికి ఒంట్లో అలా ఉంది కదా?" అంది రాధ.

"నాకు ఆఫీసులో అర్జంటు పనులున్నాయి, రాధా. ఏం ఫరవాలేదు. ఎందుకలా గాభరా పడతావు? ఆ మందులన్నీ జాగ్రత్తగా వాడు" అని ధైర్యం చెప్పి వెళ్లిపోయాడు. వెళుతూంటే లూసీ తోక ఆడించుకుంటూ కాళ్లకు అడ్డం పడింది. దాన్ని ఒకసారి ఎత్తుకుని ముద్దాడి వెళ్లిపోయేడు.

సాయంకాలం మాధవరావు ఇంటికి వచ్చేసరికి కూతురు సుశీల దిగులుగా కూర్చుని ఉంది హాల్లో. కాన్వెంటునుండి అప్పుడే వచ్చింది. జోళ్లయినా ఇంకా విప్పలేదు. సుశీల వాలకంచూసి మాధవరావు కంగారు పడ్డాడు, బుజ్జికి ఎలా ఉందోనని.

"ఏం సుశీ, అలా ఉన్నావు?"

"లూసీకి జబ్బుచేసింది, డాడీ. మధ్యాహ్నం నుండి దానికి ఒకటే విరేచనాలు" అంది దిగాలుగా.


మాధవరావు చిన్నగా కొడుకు పడుకొని ఉన్న గదిలోకి వెళ్లాడు.

"రాధా, ఎలా ఉంది బుజ్జికి?"

మంచానికి అంటుకుపోయి పడుకొని ఉన్న కొడుకును, దిగాలుగా పక్కనే కూర్చుని ఉన్న రాధను చూసిన అతని మనస్సు వికలమైంది.

ఇంతలో తల్లి శాంతమ్మ గదిలోకి వచ్చింది.





"బుజ్జిగాడికేమీ బాగుండలేదురా. ఈవేళమింగించిన మందు కూడా పనిచేసినట్లు లేదు. నువ్వు అర్జంటుగా డాక్టరుగారిని తీసుకురావాలి" అంది శాంతమ్మ.

"అమ్మా, లూసీకికూడా విరేచనాలు అవుతున్నాయటే?"

"అవునురా, ఈవేళ అంతా అది ఏంపెట్టినా తినడంలేదు. పాలుకూడా ముట్టుకోవడంలేదు."

"బిస్కట్లుకూడా తినడంలేదు, డాడీ" అంది సుశీల.

మాధవరావు హడావిడిగా డాక్టరుకోసం పరిగెత్తాడు. డాక్టరు వచ్చి ఇంజెక్షన్ చేసి, ఆ రాత్రికి వాడవలసిన మందుల చీటీ వ్రాసి ఇచ్చి వెళ్ళిపోయేడు.

ఈ హడావిడి అయ్యేవరకూ మాధవరావు లూసీని చూడనేలేదు. కాని అతని మనస్సు దానిమీదనే ఉంది. డాక్టరు వెళ్ళిపోగానే లూసీ దగ్గిరికి వెళ్ళాడు. యజమానిని చూసి అది నీరసంగా తోక ఆడించింది. తను కనబడగానే ఎగిరి మీదపడే లూసీని అలా నీరసంగా లేవలేని పరిస్థితిలో చూసిన అతని మనస్సు నీరసపడింది.

ఆ రాత్రి అంతా మాధవరావుకు సరిగా నిద్రపట్టలేదు. కొంతసేపు కొడుకు గదిలోకీ, కొంతసేపు లూసీ దగ్గిరికి తిరుగుతూ రాత్రి అంతా అశాంతితో గడిపాడు. రెండు మూడు సార్లు మూలుగు వినబడి కొడుకు గదిలోకి, కాదనుకొని లూసీ దగ్గిరికి వచ్చాడు.

లూసీఏదో బాధతో మూలుగుతూంది పాపం! దాని బాధ ఏమిటో తెలుసుకోవాలని మాధవరావు తాపత్రయం. దీనంగా అతనివైపు కళ్ళు తిప్పి చూడటం తప్ప అదేమీ అతనికి చెప్పలేకపోతూంది. 'యజమానికోసం తమ ప్రాణాల్ని సైతం అర్పించగల విశ్వాసం ఇచ్చాడు గాని, వాటి బాధ తెలుపుకొనే భాష ఇవ్వలేదు దేవుడు' అనుకున్నాడు.

ఉదయమే డాక్టరు వచ్చి బుజ్జికి ఇంజెక్షన్ ఇచ్చాడు.

డాక్టరు జాగ్రత్తగా చూస్తూన్న తన బిడ్డను గురించి మాధవరావుకు అంతగా ఆదుర్దా అనిపించడం లేదు. అయినా రెండు రోజులనుండి మందులు వాడుతూన్నా నయం కాలేదని అతని మనస్సు వ్యాకులంగానే ఉంది. రాధ పడే వేదన చూస్తే అతనికి మరీ దిగులుగా ఉంది.

డాక్టరు వెళ్ళగానే రాధను పిలిచాడు. "రాధా, నేనీరోజు ఆఫీసుకు వెళ్ళడంలేదు. అటు బుజ్జికి సుస్తీ, ఇటు లూసీకి సుస్తీ! లూసీని అర్జంటుగా వెటర్నరీ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాలి."

రాధ ఒకసారి భర్త ముఖంలోకి తీక్ష్ణంగా చూసింది. 'నిన్న ఆఫీసులోని అర్జంటు పనులు ఈవేళ ఏమైనాయి? మన బిడ్డకోసం లేని అర్జంటు ఈ కుక్కపిల్లకోసం వచ్చిందా?' అనాలనిపించింది రాధకు.

కాని ఏదో బాధతో ముకుళితమైన భర్త ముఖం చూసి అలా అనలేకపోయింది.

"అటు వెళుతున్నారుగా, డాక్టరు రాసి ఇచ్చిన మాత్రలుకూడా తీసుకు రండి" అని మాత్రం అనగలిగింది.

"ఏం గాభరాపడకు, రాధా! బుజ్జికి త్వరగా నయమవుతుందని డాక్టరు చెప్పాడు" అని రాధకు ధైర్యం చెప్పి, లూసీని తీసుకువెళ్ళడానికి రిక్షా పిలిపించాడు.

రిక్షా ఎక్కుతూండగా కూతురు సుశీల వచ్చి రిక్షాలో కూర్చుంది.

"నువ్వెక్కడికి, సుశీ, ఇంకా బడికి పోలేదూ?"

"లేదు, డాడీ! ఈవేళ నేను బడికి వెళ్ళను. నేనుకూడా లూసీతో హాస్పిటల్‌కి వస్తాను."

తండ్రికి వేరే ఆలోచనకు అవకాశం ఇవ్వకుండా రిక్షాలో ఎక్కి కూర్చుంది లూసీని ఒళ్ళో పెట్టుకొని.

వెటర్నరీ హాస్పిటల్లో లూసీకి ఇంజెక్షన్ ఇచ్చారు. ఇంజెక్షన్ చేసినప్పుడు లూసీ బాధతో మూలిగింది. మాధవరావుకు తన గుండెకాయకే తిన్నగా ఇంజెక్షన్ చేసినట్లనిపించింది.

దానికి వచ్చిన జబ్బు పేరేమిటో డాక్టర్ని అడగా లనుకున్నాడు కాని వెటర్నరీ భాషలో ఆ జబ్బేమిటో చెప్పినా తన కర్థంకాదని "మళ్ళీ ఎప్పుడు తీసుకు రమ్మంటారు?" అని అడిగేడు.

"దీనితో తగ్గిపోవాలి. అయినా ఆహారంమాత్రం ఏమీ ఇవ్వకండి. అంతకీ తగ్గకపోతే రేపు ఉదయం మళ్ళీ తీసుకు రండి" అన్నాడు డాక్టరు.

ఆ రోజంతా లూసీకి విరేచనాలు అవుతూనే ఉన్నాయి. అది ఇటూ అటూ కదల్లేనంత నీరసంగా పడిఉంది.

బుజ్జికి వాంతులు తగ్గాయి. కాని జ్వరం మళ్ళీ తీవ్రంగా వచ్చింది సాయంకాలానికి. డాక్టరుకు కబురు చేశారు. ఉదయం రాసిన మాత్రలు రాత్రంతా మూడు గంటల కొకసారి వెయ్యమన్నాడు.

శాంతమ్మ కూడా దిగులుపడిపోయింది 'బిడ్డకి నయం కావటం లేదేమా?' అని. రాధ సంగతి సరేసరి. ఇంట్లో తిరుగుతూందన్నమాటే గాని ఆమె మనస్సు దిగులుతో నిండిపోయింది.

మాధవరావు బాధ అనిర్వచనీయం. అటు తన రక్తాన్ని పంచుకొని పుట్టిన బిడ్డ, ఇటు తన హృదయాన్ని పంచుకొన్న నోరులేని జంతువు. వీరిద్దరి బాధను చూడలేక అతని హృదయం ముక్కలవుతూంది. తన దిగులు దిగమింగి రాధకు ధైర్యం చెబుతున్నాడు. అయినా భగవంతునిమీద భారం వెయ్యడం తప్ప తను చెయ్యగలిగిం దేమీ కనబడటం లేదు.

రాత్రి పన్నెండు గంటలకు లూసీ బాధతో అరిచింది. మూలుగుతూ వెల్లకిలా పడిపోయింది నీరసంగా. మాధవరావు ఒకసారి ఒడిలోకి తీసుకుని సరిగా పరుండబెట్టాడు. అది బ్రతుకుతుందనే ఆశ అతని కేమాత్రము లేదు.

పక్కగదిలోకి వచ్చి గుమ్మం దగ్గిర నిలబడ్డాడు. కొడుకు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అంతకు ముందుగానే మందిచ్చి, రాధ మంచం పక్కనే కూర్చుని కలత నిద్ర పోతూంది.

ఆ అర్ధరాత్రి భయంకరమైన నిశ్శబ్దం మాధవరావును పలకరించింది. అతని గుండెల్లో ఏవో తెలియని గుబులు ఆవహించింది.

తెల్లవారుఝాము నాలుగు గంటలైంది. మాధవరావు రెప్పవాల్చకుండా అలా పడక కుర్చీలో పరుండే ఉన్నాడు హాల్లో.

బుజ్జి కెవ్వుమని ఒక్క కేక వేశాడు నిద్రలో. దాంతో పక్కనే ఉన్న రాధకూ, పక్క గదిలోని శాంతమ్మకూ పూర్తిగా మెలకువ వచ్చింది. బుజ్జి పెద్ద వాంతిచేసి సొమ్మసిల్లిపోయేడు. రాధ కంగారుగా అత్తగార్ని లేపుకు వచ్చింది. మాధవరావు గదిలోకి పరిగెత్తాడు.

రాధ బిడ్డని ఒడిలో తీసుకొని హఠాత్తుగా "అత్తయ్యా" అని అరిచి బిడ్డని అత్తగారి చేతిలో పెట్టింది... అప్పటికే ఆ బిడ్డ ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది!

ఈ లోకంలో జరిగే అన్యాయాల్ని చూడలేక గత రాత్రి మరో లోకానికి పోయిన సూర్యుడు అప్పుడే మృత్యుదేవత తొంగిచూసిన ఆ ఇంటిమీద తన ఉషః కాంతుల్ని మెల్లగా ప్రసరిస్తున్నాడు. ప్రకృతి బద్ధకంగా మేల్కొంటూంది.

జరిగినదాన్ని నమ్మలేక నిస్తుపోయి మంచం దగ్గిర కూలబడిపోయిన రాధ ఒడిలోకి లూసీ మెల్లగా నడుచుకుంటూ వచ్చి కూర్చుంది!

లూసీని తన ఒడిలో చూసి రాధ ఉలిక్కి పడింది! 'లూసీ చనిపోయి ఉంటే తన బిడ్డ బ్రతికి ఉండేదేమో' అనే ఆలోచన రాధ హృదయాంతరాళంలో ఎక్కడో తళుక్కుమంది ఒక్క క్షణం!

కాని తన ఒడిలోని లూసీని హృదయానికి హత్తుకొని రాధ వెక్కివెక్కి ఏడవసాగింది.

ఆ దృశ్యాన్ని గుమ్మంలో నిలబడి చూస్తున్న మాధవరావు కొయ్యబారి నిలబడిపోయాడు! ★



అశ్వపోషకులు

ఫోటో — బ్రహ్మదేవ్ (డేరాడూన్)